# మిసెస్ పరాంకుశం



## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*1971 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన రెండవ నవల*

*రెండవ భాగం..*

## 2

**రేడియోలో** ఇంగ్లీష్‌లో ఉదయం వచ్చే వార్తలు వింటూ, వాటిని రాస్తూ పరాంకుశం గదిలో కూర్చుని షార్ట్‌హ్యాండ్ ప్రాక్టీస్ చేసుకుంటున్నాడు. అది పరాంకుశం దిన చర్యలో ఓ భాగం.

అకస్మాత్తుగా ఎదురింట్లోంచి గట్టిగా అరుపులు వినిపించసాగాయి. ఇక రాయడం కుదరక రేడియో ఆపేసాడు పరాంకుశం. గది కిటికీ దగ్గరకు వెళ్ళి బైటకి చూసాడు. ఎదురింట్లో నుంచి వినిపిస్తోంది గొడవ.

ఎదురింటి అతను పెళ్ళాం మీద గట్టిగా అరుస్తున్నాడు. మధ్య మధ్యలో బూతులు దొర్లుతున్నాయి. దెబ్బల చప్పుడు వినిపిస్తోంది.

మామూలే. పెళ్ళాన్ని పడేసి చావబాదుతున్నాడు. అనుమానపు మొగుడు అనుకున్నాడు పరాంకుశం. సన్నగా అతని పెళ్ళాం ఏడుపు వినిపిస్తోంది.

ఆ అమ్మాయిని తలచుకుంటే పరాంకుశానికి జాలేసింది. అంత అనుమానపు మనిషయినప్పుడు అసలు ఎందుకు పెళ్ళి చేసుకోవాలి? అందులో వయసు కలవదు. ఇద్దరికీ ఎంతో బేధం ఉంది. వాళ్ళిద్దరినీ పక్క పక్కన చూసిన ఎవరయినా పెద్ద కూతురు అనుకుంటారు. ఆలోచిస్తూ పరాంకుశం ఉదయం కాఫీ తాగాక ఫ్లాస్క్‌లో పోసి ఉంచుకున్న వేడి నీటిని చిన్న పాత కప్పులో పోసాడు.

కప్పులోని ఆ వేణ్ణీళ్ళని పరాంకుశం షేవింగ్ బ్రష్‌తో గడ్డానికి రాసుకుంటుంటే అమ్మాజీ వచ్చింది.

"ఈ వేళ సినిమా." గుమ్మం ప్రక్కన పడివున్న పేపర్‌ని తీసి బల్ల మీద పెడుతూ గుర్తు చేసింది అమ్మాజీ.

పరాంకుశం షేవిగ్ క్రీమ్ గడ్డానికి రాసుకుంటూ చెప్పాడు.

"సారీ. ఈ రాత్రికి మళ్ళీ అర్జంట్ పని తగిలింది. రేపు తప్పకుండా తీసుకువెళతాను."

"ఓ. ఓ. చాలా బాగుంది. గోడమీద రాసుకోనా రేపు అని."

"నిజం. రేపు తీసుకువెళతాను. ప్రామిస్."

"రేపు రాత్రి మళ్ళీ ఇంకేదో అర్జంటు పని తగులుతుంది."

"రేపు మధ్యాహ్నం సెలవు పెట్టి మాట్నీకి తీసుకువెళతాను పోనీ. ఈ రాత్రి మాత్రం వదిలేయి."

"అసలు మిమ్మల్ని అడగటమే పొరపాటు నాది." బుంగమూతి పెట్టింది అమ్మాజీ.

"ప్లీజ్! రేపు నీకో శుభవార్త కూడా చెబుతాను."

పరాంకుశం రేజర్‌లోకి బ్లేడు ఎక్కిస్తూ చెప్పాడు.

"పెళ్ళి కుదిరిందా?"

ఆ అమ్మాయి కంఠంలో ధ్వనించీ, ధ్వనించని వణుకుని గమనించి చిన్నగా నవ్వి అన్నాడు.

"ఇప్పుడేమీ చెప్పను. రేపు చెబుతాను."

"ఈ రేపు కూడ గోడ మీద రాసుకోనా?"

"వద్దు. రేపు బాకీలన్నీ తీర్చేస్తాను."

"చూస్తాగా. నగరంలో ఇన్ని కొత్త సినిమాలు లేవు. అసలు రాత్రుళ్ళు మీరు కొత్తగా ఎక్కడికి వెళుతున్నట్లు?" అడిగింది అమ్మాజీ.

"జవాబు రేపు చెపుతా కాని, ఎదురింట్లో ఏమిటి మళ్ళీ గొడవ?" అడిగాడు పరాంకుశం గడ్డం గీసుకుంటూ.

"అనుమానం మొగుడు చెబితే నమ్మడు. కొడితే ఏడుస్తాడు. మామూలే."

అమ్మాజీ నవ్వుతూ వెళ్ళిపోయింది.

స్నానం చేసి వచ్చాక పేపర్ చూసి, నోట్ బుక్‌లో రాసుకున్న పాయింట్స్ పరాంకుశం మరొకసారి చదువుకున్నాడు. సౌదామిని ఒప్పుకుంటే, ఇకముందు జరగవలసిన పనులని, చేయవలసిన ఏర్పాట్లని గురించి రాసుకున్నాడు పరాంకుశం ఆ పుస్తకంలో.

బట్టలు తొడుక్కుని బయలుదేరాడు. బయటికి వెళుతూ, గోడకి ఉన్న కేలండర్ మీది కృష్ణుడి బొమ్మకి అగరువత్తి వెలిగించి పెట్టి, తన కార్యం నిర్విఘ్నంగా చేయమని ప్రార్థించి బయలుదేరాడు.

వీధి చివర ఎదురింటాయన కిళ్ళీ నములుతూ పరాంకుశానికి కనబడ్డాడు, ఆయన పరాంకుశం వంక ఎగాదిగా చూసాడు. పరాంకుశానికి అతనంటే ఒళ్ళుమంట. బ్రహ్మచారి కాబట్టి, ఎదురింట్లో ఉంటున్నాడు కాబట్టి, అనుమానం మనిషి కాబట్టీ, తనంటే అతనికి ఇష్టం లేదని పరాంకుశానికి తెలుసు.

కనీసం పలకరింపుగా అయినా నవ్వకుండా ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు పరాంకుశం. అంత అసహ్యం అతనంటే.

✷✷✷

"రాత్రి వెళ్ళావా?" అడిగాడు శ్రీకంఠం ఆఫీస్‌లో.

ఇద్దరూ ఒకే కంపెనీలో స్టెనోగ్రాఫర్సుగా పనిచేస్తున్నారు. ఒకేసారి చేరారు. ఇద్దరి ఇంటర్వ్యూలు కూడా ఒకేసారి అయాయి. వాళ్ళిద్దరూ కాలేజీలో కూడా కలిసే చదివారు.

"వెళ్ళాను. రెండు ముఖ్యమైన లెటర్స్ ఉన్నాయి. టైప్ చేసి సంతకానికి పంపాక మాట్లాడదాం."

పావుగంటలో లెటర్ హెడ్స్ మీద రెండు ఉత్తరాలు టైప్ చేసి మేనేజర్ గదిలోకి పంపాక లేచి, శ్రీకంఠం బల్ల ముందున్న కుర్చీలో కూర్చున్నాడు.

"ఇప్పుడు అడుగు." చెప్పాడు నవ్వి.

"ఏమన్నది? ఒప్పుకుందా?"

"ఇవాళ రాత్రి మళ్ళీ రమ్మంది."

"వెంటనే ఎందుకు చెప్పలేదుట?"

"ఆలోచించుకుంటుందిట"

"ఇలాంటి అవకాశం వస్తే ఎగిరి గంతేసి ఒప్పుకోవాలే?"

"అసలు నమ్మలేదు. నమ్మించేందుకు తల ప్రాణం తోక కొచ్చింది. అనేక యక్ష ప్రశ్నలు వేసింది. నన్ను స్టడీ చెయ్యటానికనుకుంటా."

"గుడ్ తెలివయినదేనన్నమాట. అసలేం జరిగిందో వివరంగా చెప్పు?"

తనకి సౌదామినికి మధ్య గత రాత్రి జరిగిన సంభాషణని, ఏమీ దాచకుండా వివరంగా తన స్నేహితుడు శ్రీకంఠానికి చెప్పాడు పరాంకుశం.

చిన్నగా ఈల వేసాడు శ్రీకంఠం.

"కంగ్రాజులేషన్స్ ఇన్ ఎడ్వాన్స్." చెప్పాడు.

"దేనికి?" అడిగాడు పరాంకుశం.

"దేనికంటే, సౌదామిని నువ్వంటే ఇష్టపడుతోంది కనక. తప్పకుండా ఒప్పుకుంటుంది."

"ఎలా చెప్పగలవు?"

"వ్యభిచారి ఎప్పుడూ డబ్బు దగ్గర నిర్మోహమాటంగా ఉంటుంది. ఆ కుంటి వెధవ లేకపోతే తప్పకుండా డబ్బు తీసుకునేదాన్ని కాదు అన్నదంటే, నిన్ను కేవలం ఒక విటుడిగా ఆ దృష్టితో చూడటం లేదన్నమాట."

పరాంకుశం మాట్లాడలేదు.

"మళ్ళీ ఆలోచించావా?" అడిగాడు శ్రీకంఠం కాసేపు ఆగి.

"ఆలోచించాను. మార్పేమీ లేదు."

"జీవితం తర్వాత సుఖంగా ఉండదు సుమా!" హెచ్చరించాడు శ్రీకంఠం.

"కొంతకాలం మాత్రమే. ఆ తర్వాత హాయిగా ఉంటుంది."

"ఆదర్శం పేరుతో నువ్వు నీ నిండు జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నావేమో అనిపిస్తోంది."

"నువ్వు నా మిత్రుడివి. ఓ మంచి పని చేస్తుంటే ప్రోత్సహించాలి తప్ప ఇలా నిరుత్సాహపరచకూడదు."

"ఏ కులాంతర వివాహమో, మతాంతర వివాహమో, లేదా వితంతు వివాహమో అయితే ప్రోత్సహించేవాణ్ణి. చూస్తూ చూస్తూ ఓ కులటని వివాహం చేసుకుంటానంటే ఎలా సమ్మతించను? నీతో సరిగ్గా కాపురం చేస్తుందా? నాకు ఇలాంటి ఎన్నో అనుమానాలు."

పరాంకుశానికి కోపం వచ్చిందని అతని ముఖ కవళికలు బట్టీ గ్రహించి నవ్వి చెప్పాడు శ్రీకంఠం.

"నీ నిర్ణయంలో తిరుగులేదు గనుక నీకు ఎప్పుడూ నా ప్రోత్సాహమే లభిస్తుంది. నీ స్నేహితుణ్ణి నేనే 'కులట' అంటే నీకు అంత కోపం వచ్చిందే? రేపు పెళ్ళయ్యాక ఇంకా ఎంత మంది నోట నువ్వు ఎన్ని మాటలు వినాల్సి వస్తుందో, అదంతా ఎలా భరించగలవు?"

"నాకుకోపం రాలేదు." తన కోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ చెప్పాడు పరాంకుశం.

"కోపం రాకుండా చేసుకోవటమే కాదు. ఇకనుంచి సహనం కూడా అలవరచుకోవాలి, బ్రదర్! అప్పుడే నీ జీవితం సాఫీగా సాగేది." నవ్వుతూ చెప్పాడు శ్రీకంఠం.

"నిజమే." ఒప్పుకున్నాడు పరాంకుశం.

కాసేపాగి అడిగాడు శ్రీకంఠం.

"ఒప్పుకుంటే ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావు?"

"వారం రోజుల తర్వాత."

"రిజిస్టర్ మారేజా?"

"అవును. ఇలాంటి సందర్భంలో శాస్త్ర ప్రకారం నాకు ఇష్టం లేదు."

"అవును. అదే మంచిది. నువ్వో మంచి ఇల్లు చూసుకోవాలి వెంటనే."

"ఇల్లు దొరకడం దుర్లభం. ఇంటి వాళ్ళకి సౌదామిని గురించి ముందే తెలిస్తే ఇవ్వరు." చెప్పాడు పరాంకుశం.

"ప్రయత్నం చేద్దాం. ఎక్కడో ఓచోట దొరక్కపోదు." ఆశాభావంతో చెప్పాడు పరాంకుశం.

సాయంత్రం శ్రీకంఠంతోపాటు ఆరున్నరకి ఆఫీసులోంచి బయలుదేరాడు పరాంకుశం.

ఏడున్నర ప్రాంతంలో హోటల్‌లో భోజనం ముగించి ఇద్దరూ ఆ సందు దగ్గరికి చేరుకున్నారు.

"గుడ్ లక్." చెప్పాడు శ్రీకంఠం ఆప్యాయంగా స్నేహితుడి చెయ్యి నొక్కి.

పరాంకుశం నెమ్మదిగా ఆ సందులోకి నడిచాడు.

సందు మొదట్లో ఓ ఇంట్లో నుంచి ఏడుపు గట్టిగా వినబడుతోంది.

"బాబోయ్! చంపేస్తున్నారు."

ఏడుపు, అరుపులు ఆగిపోయాయి ఠక్కున. ఎవరో అరవకుండా నోరు నొక్కి ఉండవచ్చు అనుకున్నాడు పరాంకుశం.

ఆ గొంతు ఓ ఆడపిల్లది.

సిగ్గు విడిచి, లజ్జ దాచి, మానం మరిచి, శీలం పంచి పొట్టలు నింపుకోవడానికి ప్రయాసపడే ఆ అమ్మాయిలని, వాళ్ళని తమ కబంధ హస్తాల్లోంచి పారిపోకుండా కాపు కాసే మగరాయుళ్ళని దాటుకుంటూ పరాంకుశం ఆ ఇంటి ముందు ఆగాడు.

సరాసరి లోపలికి వెళ్ళాడు.

కుంటతను చుట్ట తాగుతూ కూర్చునున్నాడు.

"సౌదామిని" చెప్పాడు పరాంకుశం అతని ముందు ఆగి.

ఎవరూ వెయిటింగ్ లో లేరు. ఓసారి ఎగాదిగా చూసాడు కుంటతను పరాంకుశం వంక. మౌనంగా చెయ్యి చాపాడు.

పరాంకుశం జేబులోంచి పాతిక రూపాయల నోటు తీసి కుంటతనికి అందించాడు.

దాన్ని లెక్కపెట్టుకుని లోపలికి వెళ్ళొచ్చు అన్నట్లుగా సౌంజ్ఞ చేసాడు. తలుపు దగ్గరికి వేసి ఉంది. లోపలికి వెళుతూ తలుపు తోసాడు పరాంకుశం. కిర్రుమంటూ తలుపు తెరుచుకుంది.

సౌదామిని ఓ విరిగిపోయిన అద్దం ముందు కూర్చుని జడ వేసుకుంటోంది. అద్దంలోంచి పరాంకుశాన్ని చూసి నవ్వి చెప్పింది.

"రారా, బుల్లోడా, ఇవాళ పెందలాడే వచ్చావే."

పరాంకుశం వెనక్కి తిరిగి తలుపు దగ్గరకు వెళ్ళి, తలుపు గడియ వేసి మంచం మీద కూర్చున్నాడు.

"ఒక్క నిమిషం. తయారై వస్తాను." చెప్పింది సౌదామిని జడ అల్లుకుంటూ

"ఏం నిశ్చయించావు?" అడిగాడు.

"చెబుతా ఉండు. తొందరేం?"

గబగబా జడ అల్లుకుని, మధ్యలో పక్కనే వెలుగుతున్న సిగరెట్ అందుకుని రెండు దమ్ములు లాగి వచ్చి పరాంకుశం పక్కన ఆనుకుంటూ కూర్చుంది.

"ఎలా ఉన్నాను ఇవాళ?" అడిగింది జారిపోని పైట సర్దుకుంటూ.

"బాగున్నావులే. ఏ సంగతీ తేల్చి చెప్పు."

పరాంకుశం భుజానికి ఆనుకుని విరగబడి నవ్వింది.

"ఏమిటిది?" అడిగాడు పరాంకుశం చిరాకుగా పక్కకి జరుగుతూ.

"ఏం లేదు. నిన్న నువ్వెళ్ళాక బేరాలు లేవు. ఇవ్వాళ ఇంతవరకూ లేవు. అంతే."

మత్తుగా చూసింది పరాంకుశం కళ్ళలోకి.

"ముందర తేల్చి చెప్పు. సందు చివర నా స్నేహితుడొకణ్ణి నిలబెట్టి వచ్చాను."

"ఈ కాస్త దానికే ఇంత ఇదయిపోతే రేపు పెళ్ళయ్యాక..."

పరాంకుశం మగవాడు, బ్రహ్మచారి. వయసులో ఉన్నవాడు. సౌదామిని ఆడది, వేశ్య. పరాంకుశం అంటే మోహం పెంచుకున్నది. రెచ్చగొట్టగలదు.

నాలుగయిదు నిమిషాలు పెనుగులాడి చివరికి సౌదామినికి, సౌదామినిలోని జాణతనానికి వివశుడయిపోయాడు. పది నిముషాల తర్వాత తేరుకున్నాడు.

"అయితే పెళ్ళికి ఒప్పుకున్నావన్నమాట?" అడిగాడు సిగరెట్ వెలిగిస్తూ.

"ఒప్పుకున్నాను." ఎగబడి పరాంకుశం చేతిలో సిగరెట్ పాకెట్‌ని సౌదామిని ఆత్రంగా లాక్కుంది.

"అంటే నాతో కాపురం చేయడానికి వచ్చేస్తావా?" అడిగాడు. "వస్తాను, నువ్వు నచ్చావు నాకు. కాని, కొన్ని షరతులు బుల్లోడా."

"ఏమిటవి?"

"నంబర్ వన్. నువ్వు నన్ను ఎపుడూ కొట్టకూడదు."

చెంప తడుముకుని చెప్పింది.

"అలాగే."

"నీ పెళ్ళాం కాకుండానే నిన్న కొట్టావు. పెళ్ళి చేసుకోవటం అంటే నీకు బానిసని అవడం కాదు."

తల ఊపాడు చిన్నగా నవ్వి.

"నంబర్ టు. నా అలవాట్లు మార్చుకోను, మార్చుకోమని నువ్వు బలవంతం చేయకూడదు."

"నీకున్న అలవాట్లేమిటి?"

"సిగరెట్! జల్సా! ఎప్పుడయినా..."

"ఎప్పుడయినా?"

"ఎప్పుడయినా దొరికితే మందు."

"ఇంకా?"

"నెంబర్ ఫోర్."

"నెంబర్ త్రీ చెప్పలేదు?"

"ఓ! టు తర్వాత త్రీ కదా. నంబర్ త్రీ. రెండురోజులకొక సినిమాకి తీసుకెళ్ళాలి."

"అలాగే." తల ఊపాడు నవ్వి.

"నెంబర్ ఫోర్. నెలకో వందయినా నా స్వంత ఖర్చుకి ఇవ్వాలి."

"జీతమంతా నీకే ఇస్తాను. సరేనా?" చెప్పాడు పరాంకుశం నవ్వి.

"నెంబర్ టెన్. వీడిని చూశావు, వాడితో మాట్లాడావు అని వేధిస్తే మళ్ళీ ఇక్కడికి వచ్చేస్తాను. నాకు నీ దగ్గర బాగా లేకపోతే తిరిగి వచ్చేస్తాను. అందుకు ఒప్పుకుంటేనే తీసుకెళ్ళు."

"ఆల్‌రైట్. మరి నా షరతులు విను"

"చెప్పు."

"ఫోర్ తర్వాత ఫైవ్. టెన్ కాదు. కనీసం రాయటం అయినా నేర్చుకోవాలి. చదువు నేర్చుకోవాలి నువ్వు."

"నాకు తెలుగు రాయటం వచ్చులే. ఎనిమిది దాకా చదివాను."

"ముఖ్యమయిన షరతు. మళ్ళీ ఈ వృత్తి చెయ్యకూడదు. అందరిలాగా పవిత్రంగా ఉండాలి."

"ఇంకా?"

"అదొక్కటే."

"అలాగే. ప్రతి అడ్డమయినవాడితో పోవటానికి నాకు మాత్రం ఇష్టమా? నువ్వు చెప్పినట్లే వింటాలే."

"ఇంకో నెల రోజుల్లో మన పెళ్ళి జరుగుతుంది."

"అది సరే. ఇక్కడినుంచి బయటపడేది ఎలా?"

"ఆ సంగతి నాకొదిలేయి."

పరాంకుశం జేబులోంచి చిన్న పొట్లం తీసి విప్పి మల్లెపూల దండ సౌదామినికి అందించాడు.

"నా కోసమే కొన్నావా?" అడిగింది పూల చెండు తల్లో తురుముకుని.

"అవును. ఆ మల్లెపూలలా, ఆ మల్లెపూల మీద నిన్న రాత్రి పడ్డ వెన్నెల్లా స్వచ్ఛంగా ఉండాలి నువ్వు. అందుకే మల్లెలు తెచ్చాను."

"ఉంటాలే." సిగరెట్ తాగుతూ చెప్పింది.

పరాంకుశం మంచం మీద నుంచి లేచాడు.

"తర్వాత కలుస్తాను."

సౌదామిని చేతిలోని సిగరెట్ పాకెట్ అందుకుని తలుపు వైపు నడిచాడు.

"సిగరెట్ పాకెట్ నా మొహాన పారేయి". చెప్పింది సౌదామిని గట్టిగా.

పరాంకుశం చిన్నగా నవ్వి దాన్ని ఇవ్వకుండా తలుపు తెరిచాడు.

"ఓయ్ బుల్లోడా. అదివ్వకపోతే అసలు నిన్ను పెళ్ళే చేసుకోను పో."

బయటికి వచ్చి తలుపులు మూసాడు పరాంకుశం. సిగరెట్ పాకెట్ జేబులో వేసుకున్నాడు.

సందు చివర తనకోసం ఎదురు చూస్తున్న శ్రీకంఠాన్ని కలుసుకోవడానికి గబగబా నడిచాడు. (కొనసాగింపు వచ్చేనెల..)

✷✷✷

ఈ నవల క్రిందటి భాగాలు చదవడంకోసం కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి

